బ్రతుకు బరువు

కృపశ్రీ

చంద్రయ్యా మేస్టరు వచ్చిపోయాడు.

చచ్చిపోవడ మంటే మరెందువల్లా కాదు!—అందరిలాగా ఆయుష్షు తీరే వచ్చి పోయాడు

"డెబ్బయ్యాయిదేళ్లు బతికాడు-అదృష్ట వంతుడే!-ఇంకా ఎంతకాలం బతుకుతారె వరు మాత్రం?" అన్నారు ఊళ్లో వాళ్ల కొందరు

"పోనీ—ఎలాగో ఇంతకాలానికేనా వెళ్ళిపోయేడు!—ఆ కొడుకు విసుక్కోవ డమే తప్పింది" అన్నారు మరికొందరు

ఈ రెండో వర్గం వాళ్ళు అనుకున్నట్టు గానే చంద్రయ్యా మేస్టరు మీద అతని కొడుకు సత్యం ఎప్పుడూ విసుక్కుంటూ వుండేవాడు— "బాగా వచ్చింది ఈ ముస లాడి సంత!" అని రోజుకి ఎన్నోసార్లు తండ్రి మీద చిరాకు పడేవాడు

"ఈ ముసలాడి పీడ ఏనాడు విరగడవు తుందో!" అని కూడా ఎన్నోసార్లు అను కున్నాడు

అయితే చంద్రయ్యా మేస్టరు మీద అతని కొడుకు పడిన చిరాకుకీ, విసుగు బాటుకీ తగినంత కారణం లేకపోలేదు చంద్రయ్యా మేస్టరుకి దర్జా, డబ్బుదూబరా తనం ఎక్కువ, తిండిపోతు తనం జాస్తీ. సొంతయిల్లు, రెండెకరాల పంట భూమి వీటి మూలంగానే అప్పులలో మునిగి చివ రికి అమ్ముడు పోయాయి రిటైరయ్యాక వచ్చిన పదిహేను వందల రూపాయిల ప్రావిడెంటు ఫండు కూడా వీటికే ఖర్చ యింది కొడుక్కి రవ్వంత ఆస్తికూడా మిగల్లేదు పైగా తండ్రిని పోషించే భారంకూడా మీద పడింది కొడుకు పంచన చేరినా చంద్రయ్యా మేస్టరుకి ఆ దర్జా, డబ్బు

దూబరాతనం, తిండిపోతు తనం వీస మంతయినా తగ్గలేదు సరికదా ముసలి తనంవల్ల మరింత చపలత్వం కూడా ఎక్కువయింది

చంద్రయ్య మేస్టరు కొడుకు సత్యం స్కూలు ఫైనల్ పాసయాక కాలేజీ చదువు చదువుదామని ఎంతో ఉత్సాహ పడ్డాడు కాని తండ్రి కాలేజీ చదువు చెప్పించ లేననడమే కాక వెంటనే ఏదో ఉద్యోగంలో చేరకపోతే తనింక సాక లేనని కూడా చెప్పడంచేత, తొమ్మిది మాసాల ఎమర్జన్సీ కోర్సులో మేస్టరు ట్రయినింగయి సెకండరీ గ్రేడు మేస్టరుగా ఉద్యోగంలో చేరాడు. నెలకి నూటా అరవై రూపాయిల జీతంతో భార్యా ఇద్దరు పిల్లలూ గల సంసారాన్ని గుట్టుగా కాలక్షేపంచేసి లాగుకొస్తున్నాడు. అయితే చంద్రయ్య మేస్టరు కొడుకు గుట్టుని రట్టు చేయసాగాడు డబ్బెక్కడినుంచి వస్తుంది, ఎలాగ వస్తుంది అన్న ఆలోచన లేకుండా కొడుకుని రోజూ రూపాయి, అర్థ సాదరు ఖర్చుకి అడిగేవాడు దగ్గర డబ్బులేక కొడుకివ్వకపోతే ఊళ్ళో అరువులు, అప్పులు పెట్టేవాడు నెల తిరిగేసరికి వాళ్ళంతా వచ్చి కొడుకుని తీర్చమని కూర్చొనేవారు అన్ని వస్తువుల ధరలూ రోజురోజుకీ ఆకాశాన్నంటుతూ వుండ డంతో ఒక మనిషి దగ్గర మరొక మని షిని భరించడం అంటేనే అసాధ్యంగా తయారైన కాలం అవడంచేత, నూటా అరవై రూపాయిల అల్పజీతంతో భార్యా ఇద్దరు పిల్లలూగల సంసారాన్ని యాత నగా లాగుకొస్తున్న సత్యంకి-డబ్బు దూబ రాతనం, తిండిపోతు తనమే కాని రవ్వంత జాగ్రత్త, ఆలోచనాలేని ఆ తండ్రి గుది బండగా తయారయ్యాడు — "ముందూ వెనకా చూడకుండా మీరిలాగ ఖర్చు పెడు తూంటే నేనెంతకని భరించగలను నాన్నా?" అని తండ్రితో ఎన్నోసార్లు అన్నాడు సత్యం కాని చంద్రయ్య మేస్టరు కొడుకు మాటని రవ్వంతైనా లక్ష్యపెట్టలేదు ఇందు వల్లనే సత్యం తండ్రి మీద రోజూ విసు క్కుంటూండేవాడు—"బాగా వచ్చింది ఈ ముసలాడి సంత!" అని చిరాకు పడు తూండేవాడు — "ఈ ముసలాడి పీడ ఎప్పుడు విరగడవుతుందో?" అని మన స్సులో అనుకుంటూండేవాడు.

ఎలాగైతేనేం, అతడికి ఆయుష్షు తీరి పోయిందనో, లేక కొడుకు సమస్య తీరు ద్దామనో—మృత్యుదేవత వచ్చి చంద్రయ్య మేస్టరుని తీసుకుపోయింది ఇదివరకు మనసులో ఎంతనుకున్నా తండ్రి చని పోయాడనగానే సత్యం కొంచెం ఫీల యాడు

ఐతే కన్న తండ్రి చనిపోవడం రక్త సంబంధంవల్ల బాధ కలిగించినా—కొన్ని ఇబ్బందులు కూడా తండ్రి మరణంతో తీరి పోతాయన్న భావం లేశ మాత్రంగా సత్యం మనస్సులోకి రాకుండా వుండలేదు.

చంద్రయ్య మేస్టరుకి భార్యలేదు. ఆవిడ పదేళ్ళ కిందటే పోయింది వేధవప్ప



చెల్లెలు, మేనల్లుడు, మేనకోడలు దగ్గర ఊళ్ళలో వున్నారు పెళ్ళయిన కూతురు ఆ దగ్గర ఊళ్లోనే భర్త వద్దవుంది చంద్రయ్య మేస్టరు చచ్చిపోయాడని తెలియగానే కూతురు, విధవప్ప చెల్లెలు, మేనకోడలు వచ్చారు ఆ వూళ్ళోవున్న బంధువులు, మిత్రులు, ఎరిగున్నవాళ్ళు, ఇరుగు పొరుగువాళ్ళు, వీధిలో వాళ్ళు — అంతా వచ్చారు

కొంతసేపు ఏడుపులూ మొర్రలూ పరామర్శలూ వగైరాలయాక పెద్దలు లేచి దహనానికి ఏర్పాట్లు చేదామన్నారు చంద్రయ్య మేస్టరుకి-వరస కన్నదమ్ముడైన అవధాని సత్యాన్ని చాటుకి పిలిచి- "ఎంతసేపు శవాన్ని పెట్టుకూర్చుంటారు? ఎంతసేపుంచినా పోయిన ప్రాణం తిరిగొస్తుందా?- ఇంక తరవాయి పనిచూపు!" అని చెప్పాడు

"తరవాయి పనేమిటి?" అని అడిగాడు సత్యం.

"అదే(నా! — దహనానికి ఏర్పాట్లు చెయ్యొద్దూ?" అన్నాడు అవధాని

"అవన్నీ నాకు తెలియవు బాబాయ్!- మీరే జరిపించాలి!" అన్నాడు సత్యం

"జరిపించడానిక్కాకపోతే మరిదేనికున్నాం మేమంతా?—కాని డబ్బో?" అన్నాడు సత్యంకి వేలు విడిచిన మేనమామ సీతారామయ్య.

"ఎంత డబ్బుండాలి మామయ్యా?" అని అడిగాడు సత్యం

"ఇప్పుడు దహనానికే అధమ పక్షం రెండు వందల రూపాయిలుండాలి!" అన్నాడు పౌరోహిత్యుడు శాస్త్రుల్లు

"రెండు వందల రూపాయిలే!" అన్నాడు సత్యం ఆశ్చర్యపోతూ

"అవవురా మరి?—మోసే బ్రాహ్మలు నలుగురూ నాలుగు పాతికలేనా ఇవ్వందీ రారు వచ్చిన తరువాత వాళ్ళకి నలుగురికీ కొత్త పంచల చాపులు పెట్టాలి - శవం మీదికి, క్రిందికి కొత్త బట్టుండాలి-దహనపు వస్తువులు కొనాలి అక్కడ వాళ్ళకి సుంకం చెల్లించాలి!-వీటన్నిటికీ అవవూ?" అని అడిగేడు అవధాని.

సత్యం వద్ద అప్పుడు రెండు వందల రూపాయిలు కాదు-రెండు వందల పైసలు కూడాలేవు రెండు వందల రూపాయిలు వుండాలనే సరికి అయోమయా వస్థలో పడ్డాడు ఏం చేయడమా అని ఆ వెంటనే- "మోయడానికి కూలి బ్రాహ్మలెందుకు బాబాయ్?" అని అడిగాడు

"లేకపోతే ఈ శవాన్ని ముట్టుకొని ఎవరు మోస్తార్రా?" అని అడిగారు అవధాని, శీతారామయ్య, శాస్త్రుల్లు యేక కంఠంతో

నత్యంకి చాలా కోపం వచ్చింది — "మరి మీరంతా ఏం చేదామని వచ్చినట్టు?" అని గట్టిగా అడుగుదా మనుకున్నాడు. కాని, బాగుండదని తమాయించుకొని, "కూలి బ్రాహ్మల్లెందుకు?—ఊళ్ళోవున్న గాంధీసేవా సమాజం వాళ్ళు కావాలంటే ఇలాటి సమయాలలో ఉచితంగా ఎంతో సహాయం చేస్తారు వెళ్లి వాళ్ళ నడుగు తాను!" అన్నాడు

సత్యం ఈ మాట అనడంతోనే బంధువులు, కులపెద్దలు ఎగిరి పడ్డారు—

"నీకేమైనా మతిపోయిందిట్రా?" అని అడిగాడు అవధాని

"మతెందుకు పోవడం బాబాయ్?" అన్నాడు సత్యం

"లేకపోతే ఏమిట్రా యిది?—తండ్రి శవాన్ని ఆ సమాజం వాళ్ళ చేత మోయిస్తావా?—ఆ సమాజంలో అంతా శూద్రులు, మాలవాళ్లే కాని బ్రాహ్మడొక్కడు లేడురా!" అన్నాడు సీతారామయ్య

"బ్రాహ్మడు లేకపోతే ఏమయింది?—నిస్వార్థంతో సేవచేసి ఆపదలలోను, కష్టాలలోను వున్న వాళ్ళకి ఎంతో సహాయ పడుతున్నారు వాళ్ళు!" అన్నాడు సత్యం.

"అందుకని పవిత్రమైన బ్రాహ్మణ కులంలో పుట్టి, ఆ శూద్రుల చేత, మాల వాళ్ళ చేత తండ్రి శవాన్ని మోయిస్తావుట్రా?" అని అడిగాడు శాస్త్రుల్లు

"పవిత్రమయినది ఒక్క బ్రాహ్మణ కులమే కాదండీ!—అన్ని కులాలూ పవిత్రమైనవే!—ఇంత ఖర్చుపెట్టి కూలి బ్రాహ్మలచేత మోయింపించడానికి నా దగ్గర డబ్బులేదు!" అన్నాడు సత్యం

సత్యం ఇలాగ అనగానే అక్కడున్న వాళ్ళంతా అతడి వంక అతి నిరసనగా చూశారు. తండ్రంటే భక్తి గౌరవాలు



లేనివాడని, అభిమానం లేనివాడని నిందించ సాగారు-వెంటనే అవధాని, శీతారామయ్య, శాస్త్రుల్లు ఇంట్లోకి వెళ్ళి సత్యం భార్యతో సంగతంతా చెప్పేరు—

"చూడమ్మాయ్ మీ ఆయన మాటలు!- పవిత్రమైన బ్రాహ్మణ కులంలో పుట్టి, తండ్రి శవాన్ని గాంధీసేవా సమాజంలోని శూద్రుల చేత, మాలవాళ్ళ చేత మోయింపిస్తానంటున్నాడు. మతున్న మాటలేనా యివి? — మన ఆచార వ్యవహారాలూ సాంప్రదాయమూ యేమిటి, ఘన ప్రతిష్ఠ యేమిటి?—వాడికేమేనా ఆలోచనవుందా?" అని అడిగేరు

సత్యం భార్య జానకికి వయస్సు పాతిక ముప్ఫయ్ సంవత్సరాల మధ్యే వున్నప్పటికీ పాతకాలపు భావాల మనిషి మూఢనమ్మకాలు—అంతకంటే ఎక్కువగా, లోకం అంతా నడిచిన దారిలో నడవకుండా ఎదిరిస్తే అంతా ఏమనుకొని పోతారో, ఏమని నిందిస్తారో అన్న భయమూ జాస్తీ అవధాని, సీతారామయ్య, శాస్త్రుల్లు వచ్చి ఇలాగ చెప్పగానే ఆమె భర్తని ఇంట్లోకి పిలిచి, "ఏమిటండీ యిది?" అని అడిగింది.

"అవును, వంద రూపాయిలు కూలి, పంచలచాపులూ పెట్టి బ్రాహ్మల చేత మోయింపించాలంటే అంత దబ్బెక్కడి నుంచి తేవడం?" అన్నాడు సత్యం

"అందుకని శూద్రుల చేత మాలవాళ్ళ చేత తండ్రి శవాన్ని మోయింపిస్తారుటండీ—అంతా మన నేమంటారు?—

డబ్బులేకపోతే ఇవుగో-ఇవి తీసుకెళ్ళి తాకట్టుపెట్టి డబ్బుతెప్పించి పని కానివ్వండి!" అంటూ ఒంటినివున్న అయిదు తులాల చంద్రహారాలు, మూడు తులాల గాజులూ తీసి యిచ్చింది జానకికి ఆ బంగారం తల్లి చనిపోతూ యిచ్చింది ఇదివరకు సంసారంలో ఎన్ని ఇబ్బందులు వచ్చి, గడవడం ఎంత కష్టమయినా జానకి ఆ వస్తువులు తీసి ఇవ్వడానికి ఇష్టపడలేదు. పిల్లల చదువులకి, పెళ్ళిళ్ళకి అక్కరకు వస్తుందని సత్యం, జానకి ఆ బంగారాన్ని చాలా జాగ్రత్తగా చూసుకొనేవారు

భార్య శరీరానున్న బంగారమంతా తీసి ఇచ్చెయ్యగానే,—"జానకీ, నీ బంగారం ఇచ్చేస్తున్నావా?—అవకాశం దొరికిందని-రక్తం పిండినట్టు డబ్బు పిండే ఈ బ్రాహ్మలకంటే—శవాన్ని తాకితే మైలపడిపోతామనుకొనే, ప్రమాదం ముంచుకొస్తుందనుకొనే ఈ బంధువులు-స్వకులస్థులకంటే శూద్రులు, ఇతర జాతివాళ్ళు అయిన ఆ సమాజం వాళ్ళు-నిస్వార్థంగా సేవచేస్తున్న ఆ సమాజం వాళ్ళు పనికి రాకపోయారా?-ఈ బంగారం ఇప్పుడు దీనికింద ఖర్చు పెట్టేస్తే రేపు పిల్లల చదువులకీ వాటికీ ఎక్కడ తెస్తాం?" అని అడిగాడు సత్యం

"ఆవేళ కేదో చేద్దాం!—ఇప్పటికే అంతా నానామాటలూ అంటున్నారు, ఉపన్యాసం చాలించి వెళ్ళి ఎక్కడో అక్కడ తాకట్టు పెట్టించి డబ్బు తెప్పించండి!" అంది జానకి చిరాకుగా.

భార్య చిరాకు, తక్కిన వాళ్ళ రుసరుసలు చూచి సత్యం ఇంకేమీ అనలేక బంగారు గాజులు మార్వాడీ దుకాణంలో తాకట్టుకి పంపి రెండు వందల రూపాయిలు తెప్పించాడు డబ్బు వచ్చాక అవధాని, శీతారామయ్య వెళ్ళి నలుగురు బ్రాహ్మళ్ళని, సామాన్లని తీసుకొని వచ్చారు.

వచ్చిన బ్రాహ్మల్ని—"వందరూపాయిలేమిటయ్యా ఘోరం?—మనిషి అయిదేసి తగ్గించుకొని ఎనభై తీసుకొండయ్యా!" అని అడిగితే,—"బాబూ, ఇంకో మాటుకి చూసుకుందాం!—ఇప్పుడు మరి బేరం ఆడకండి!" అని అన్నారు.

"హుం!—వీళ్ళు పవిత్రమైన బ్రాహ్మలట!—ఏకోశానా మానవత్వం లేని వెధవలు!" అని కసిగా అనుకున్నాడు సత్యం

ఆఖరికి ఎలాగైతేనేం, బంధువులు కుల పెద్దలు కలిసి, చంద్రయ్య మేస్త్రి శవాన్ని కూలి బ్రాహ్మలచేత మోయింపించి తీసుకెళ్ళి, కొడుకు సత్యం చేత దహనసంస్కారాలు చేయింపించారు ఆ రోజు కాష్టం ముగిసింది.

వారం రోజులు గడిచాయి ఇదివరకు నుంచే అంతంత మాత్రంగా సాగుతూన్న సంసారంలో ఇప్పుడీ కష్టం, ఖర్చులూ ఏర్పడగా కాలూ చేయీ అందని స్థితిలో మునిగి వున్నాడు సత్యం ఇలాగ వుండగా ఏదో రోజున అవధాని, శీతారామయ్య, శాస్త్రుల్లు వచ్చారు మళ్ళీ—

"ఏరా! రేపట్నించి మీ నాన్నకి రోజులు చెయ్యాలి!" అన్నాడు అవధాని.



"అంటే ఏం చేయాలి బాబాయ్?" అని అడిగాడు సత్యం.

"ఏం చేయడమేమిట్రా?—ఆ దహనం చేసిన స్థలానికి వెళ్ళి ఎత్తిపోతలుచేయాలి. ఆ స్థలంలోను, ఇంటివద్దా మంత్రాలు చదివించి కర్మ చేయాలి. బ్రాహ్మలకి దానాలిచ్చి, మూడు రోజులూ వూళ్ళోవున్న బ్రాహ్మణ కుటుంబా లన్నిటినీ పిలిచి భోజనాలు పెట్టాలి," అన్నాడు శీతారామయ్య.

"అయితే వీటి కన్నిటికీ ఎంత డబ్బుండాలి?" అని అడిగాడు సత్యం.

"ఎంత లేదన్నా పదిహేను వందల రూపాయిలుండాలి!" అన్నాడు శాస్త్రిల్లు.

ఆ అంకె వినగానే సత్యంకి గుండె

గుభేల్‌మంది.-"పదిహేను వందల రూపాయిలే?" అని అడిగాడు ఆశ్చర్యపోతూ.

"కావురా మరి?-నేనింకా చాలా తగ్గించే చెప్పాను. న్యాయంగా అయితే అయిదారు వేల రూపాయిలుండాలి. పద్ధతి ప్రకారంగా అయితే పెద్దవాళ్ళు చచ్చిపోయినప్పుడు భూదానం, గృహదానం, గోదానం, హిరణ్యదానం చెయ్యాలి. నీ కంత శక్తిలేదు కనుక భూదానం, గృహదానం చెయ్యకపోయినా గోదానం, హిరణ్యదానం చెయ్యకతప్పదు-గోదానం చేయాలంటే ఎంత తక్కువలో చూసుకున్నా మూడు వందల రూపాయిలు పెట్టనిదీ ఆవు రాదు. అలాగే హిరణ్యదానం చేయడానికి ఏభై రూపాయిలు పెడితే కాని పావుతులం బంగారమేనారాదు. ఇంక ఇవి కాక వస్త్రదానంలాటి చిల్లర దానాలు చాలావున్నాయి ఆ పైన మూడు రోజులూ బ్రాహ్మలకీ, బంధువులకీ భోజనాలు పెట్టాలి దక్షిణలివ్వాలి. వీటన్నిటికీ కలుపుకొని ఆ మాత్రం డబ్బవదూ?" అన్నాడు శాస్త్రుల్లు. నిలువునా దోచుకుందామనే ఆ ధోరణికి సత్యం ఆశ్చర్యపోయాడు.

"అవొచ్చు కాని అంత డబ్బు నా దగ్గ రెక్కడుందండి?" అన్నాడు సత్యం అక్కడికీ ఇబ్బందిని వ్యక్తపరుస్తూ.

"అందుకని చచ్చిపోయిన తండ్రికి ఏనాలు చెయ్యడం మానేసి స్వర్గం లేకుండా చేస్తావుట్రా?" అన్నాడు శాస్త్రుల్లు,

శాస్త్రుల్లు అలా అనగానే సత్యంకి చాలా చిరాకెత్తు కొచ్చింది 'పదిహేను వందల రూపాయిలు ఖర్చుపెట్టి చేస్తే, మా నాన్న స్వర్గానికి వెళ్ళినా వెళ్ళకపోయినా ఇక్కడమేం నరకానికి వెళతామండీ' అని మనస్సులో అనుకొని, "దుక్కల్లాటి బ్రాహ్మలకి పీకమొయ్యామేపి, భూములూ, ఇళ్ళూ దానాలిచ్చేస్తే వచ్చిన వాళ్ళు స్వర్గానికి వెళతారన్న నమ్మకం నాకు లేదండీ!" అని అన్నాడు కోపంగా.

"ఇదేం బుద్ధిరా నీకు—పవిత్రమైన బ్రాహ్మళ్ళని ద్వేషిస్తావు'-దినాలు చెయ్యకపోతే పై లోకంలో మీ నాన్నకి గతులుంటాయిట్రా?—అతగాడికి స్వర్గం వుండదురా!—నరకానికి పోతాడ్రా!" అన్నాడు శీతారామయ్య

"ఆయన స్వర్గానికి వెళ్ళకపోతే మరేం ఫరవాలేదు మావయ్యా!—ఇప్పుడు పదిహేను వందలూ, రెండువేలూ పెట్టి ఏనాలు చేయడానికి నా దగ్గర అంత డబ్బులేదు! అన్నాడు సత్యం.

"అయితే తండ్రి ఋణం తీర్చుకోవుట్రా?" అని అడిగాడు అవధాని.

"తండ్రి ఋణం తీర్చుకోవడమంటే అతను చచ్చిపోయాక దుక్కల్లాటి బ్రాహ్మలకి పీక మొయ్యామేపడం, ఇళ్లూ భూములూ దానం చేయడం కాదు బాబాయ్!" అన్నాడు సత్యం.

సత్యం ఇలాగ అనగానే అవదాని, శీతారామయ్య, శాస్త్రుల్లు ఇంక అతడితో లాభం లేదనుకొని, వెళ్ళి లోపలింట్లోవున్న సత్యం భార్యతో చెప్పేరు—



“చూడమ్మాయ్, రేప్పొణ్ణించి మూడు రోజులు మీ మామగారికి దినాలు చెయ్యాలి- ష్మీ ఆయనతో చెబితే తనకిలాటి వాటిమీద నమ్మకం లేదని, తన దగ్గర డబ్బులేదని- ఏమిటేమిటో అంటున్నాడు. దినాలు జరిపి శాంతి చేసుకోకపోతే పోయిన ఆ బ్రాహ్మడికి పై లోకంలో గతులుంటాయా?—మైలపడిన ఈ యిల్లు మళ్ళీ పవిత్ర మవుతుందా?—అసలిలాటి అవాచ్యపు పనులు మన బ్రాహ్మణకులంలో పనికొస్తాయా?- నిత్యాగ్ని హోత్రంతో నిరంతర యజ్ఞ యాగాది క్రతువులుచేసి పవిత్రత పొంది మన కులానికి అగ్రస్థానం సంపాదించారు మన పూర్వులు. అలాటి అగ్రస్థానం పొందిన మన వర్ణధర్మాల్ని మంటగలుపుతాడా?” అని అడిగారు కోపంగా.

జానకి వెంటనే గదిలో వున్న భర్త వద్దకు వెళ్ళి, “మళ్ళీ ఇదేమిటండీ ఈ వాదన?” అని అడిగింది.

“అవును, దీనికిప్పుడు పదిహేను వందల రూపాయిలేనా వుండాలిట!—గోదానంట!—హిరణ్యదానంట! —వస్త్ర దానంట!—పాత్ర దానంట! —ఏవేవో వందదానాలు—అవీ పోతుల్లాటి బ్రాహ్మలకి చేయాలిట!—మూడ్రోజులూ బ్రాహ్మలందరికీ భోజనాలు పెట్టి దక్షిణ లివ్వాలిట!—ఇవన్నీ చేయించడానికి నా దగ్గర డబ్బెక్కడుంది?” అన్నాడు సత్యం.

“డబ్బు లేదనిచెప్పి జరపవలసిన కార్యాలు మానేస్తారుటండీ—ఎలాగో ఒక లాగ జరిపించాలి కాని?” అంది భార్య.

“ఎలాగ జరిపించడమో చెప్పు!” అన్నాడు సత్యం.

“అందరూ ఎలాగ జరిపిస్తున్నారు అమ్ముకొనో, అప్పుచేసో?—అంతే కాని చచ్చిపోయిన తండ్రికి దినాలు చెయ్యం, తద్దినాలు పెట్టం అంటే అంతా నోట్లో గడ్డి పెడతారు!” అంది జానకి.

"గడ్డి పెట్టడానికి మనమేం తప్పు చేశాం? — అప్పులు చేసి, అమ్ముకొని ఇలాటివి చేయడంలో అర్థం వుందా?— తల్లిదండ్రుల ఋణం తీర్చుకోవాలి. చచ్చిపోయినవాళ్ళని సంస్మరించుకొని మన భక్తి గౌరవాలు చూపాలి! దానికి కాదనను! కాని అది ఈ విధంగా కాదు! డబ్బుంటే దానిని చచ్చిపోయినవాళ్ళ పేరుతో నలుగురికీ ఉపయోగించి శాశ్వతంగా నిలిచే మరిదేనికేనా వినియోగించాలి. డబ్బు లేనపుడు మన శక్తి బట్టి చచ్చిపోయినవారిపేరుతో- కష్టపడడానికి శక్తిలేని ఒక బీదవాడికి ఒక పూట భోజనం పెట్టినా చాలు!" అన్నాడు సత్యం. సత్యం మాటలు విని, "చాల్లెండి ఉపన్యాసం! మీపాటి తెలియకనే లోకంలో అందరూ చచ్చిపోయిన వాళ్ళకి దినాలు చేస్తున్నారేమిటి? ఆ మార్వాడీ దగ్గరికే వెళ్ళి డబ్బు తెచ్చి పనులు కానీయండి!" అంది చిరాకుగా.

జానకి ఇలాగనడంతో అవధానికి, సీతా రామయ్యకి, శాస్త్రిలుకి చాలా బలం వచ్చింది—"చూడమ్మా! పెద్దవాళ్ళు చనిపోతే దహన సంస్కారాలు జరిపాక, పది రోజులు నిండకుండా, ఆ చచ్చిపోయిన వాళ్ళకి దినాలు జరిపి, బ్రాహ్మళ్ళకి భోజనాలు పెట్టి, దానాలిచ్చి శాంతి చేసుకోవాలి! ఆ తర్వాత ఏడాది వరకు నెలకొకసారి మాసికాలు పెట్టాలి. తర్వాత యేడాదినాడు సంవత్సరీకాలు పెట్టాలి! ఆ తర్వాత ప్రతి సంవత్సరం తద్దినాలు పెట్టాలి. ఇది ఏనాటి నుంచో వస్తున్న ఆచారం! ఈ ఆచారాన్ని అన్ని కులాలవారూ పాటించాలి! అందులో మన బ్రాహ్మలకి మరీ పట్టు! ఇవి పాటిం చని వాళ్ళకి పుట్టుగతులుండవు: కుటుంబ మంతా నాశనమైపోతారు! మాధవరావుగ రబ్బాయి ఇలాగే వాదించి తండ్రికి దినాలు చెయ్యడం మానేశాడు. మూడేళ్ళు తిరి క్కుండానే పదహారుసంవత్సరాల కొడుకు చచ్చిపోయాడు!" అన్నారు.

జానకికి వారలా అనగానే ఊరంత భయం వేసింది. "విన్నారా? ఆ చీడ వుంచుకోవడం మంచిది కాదు — వెళ్ళి వేగంగా బాబాయి, మామయ్యా చెప్పినట్లు చెయ్యండి! ఆ మార్వాడీ దగ్గరకు వెళ్ళి ఆ బంగారమంతా అమ్మేసి, డబ్బుచాలక పోతే వడ్డీకేనా అప్పు తీసుకురండి! త్వరగా వెళ్ళండి!" అంది భర్తతో.

సత్యంకి,భార్యకిచెప్పినందువల్లా ఆమెతో వాదించినందువల్లా ప్రయోజనం లేదని, ఇంట్లో అనవసరపు గొడవలు, శాంతిలేక పోవడమే జరుగుతుందని తెలుసు. అందువల్లనే అత నెప్పుడూ భార్యతో వాదించకుండా అలాగే అయిష్టంగా అన్నీ ఆమె చెప్పినట్టు చేస్తూ వుంటాడు. అలాగే ఇప్పుడు కూడా ఆమెకు చెప్పినందువల్లా, వాదించినందువల్లా అనవసరపు గొడవలే తప్పలాభంలేదనుకొనిమార్వాడీ దుకాణానికి బయల్దేరాడు సత్యం. దుకాణానికి వెళుతూ 'మనిషి బ్రతికున్నప్పటికంటె చచ్చిపోయినప్పుడే ఎక్కువ ఖర్చు, బాదర బందీ అన్నమాట!' అని అనుకున్నాడు మన స్సులో